ఆరోగ్యరక్షణ లక్ష్యం

- సకల వసతులతో ఆస్పత్రి భవనాల నిర్మాణం
- అందుబాటులోకి మెరుగైన వైద్య సేవలు
- ప్రభుత్వ చర్యలతో ప్రజలకు ఆరోగ్య భద్రత



రూ 4.60 కోట్లతో నిర్మించిన కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం



కంకిపాడు: 'పెచ్చులూడిన భవనాలు.. ఇరుకు గదులు.. అందుబాటులో ఉండని సిబ్బంది.. అరకొరగా మందుల నిల్వలు.. అత్యవసర వైద్యానికి రోగుల ఉరుకులు పరుగులు.. వెరసి అనారోగ్యాలతో అవస్థల బారిన జనం.. పట్టించుకున్న నాథుడే లేడన్న ఆవేదన.. ఇది గత పాలకుల హయాంలో నెలకొన్న దుస్థితి. 'వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. ఆస్పత్రుల అభివృద్ధికి నాడు - నేడుతో నిధులు సమకూర్చింది. రూ.కోట్లు వెచ్చించి ఆస్పత్రుల నూతన భవనాలను నిర్మించింది. సిబ్బంది, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంది. అత్యవసర వైద్యం సైతం స్థానికంగానే అందుతుండటంతో ప్రజలు ఆరోగ్య భద్రత లభించదనే భరోసా ఉన్నారు. ఇది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రజలు చెబుతున్న మాట.

గత పాలకుల హయాంలో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్న ప్రతి ఒక్కరి మాట ఇదే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసింది. ఆరోగ్య భద్రత కల్పిస్తూ సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు జవసత్వాలు నింపింది. కునారిల్లుతున్న ఆస్పత్రులకు సకల హంగులు అద్దింది. మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంది. నాడు - నేడు, ఆస్పత్రుల నూతన భవన నిర్మాణాలు వంటి చర్యలతో ప్రజారోగ్యానికి భద్రత కల్పించింది.

రూ.8 కోట్లతో ఆస్పత్రుల నిర్మాణం

పెనమలూరు నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుంది. ఇందులో భాగంగా రూ. 8 కోట్ల అంచనాతో నూతన భవనాలకు అందుబాటులోకి తెచ్చింది. కంకిపాడులో రూ.4.60 కోట్లతో 30 పడకల ఆస్పత్రి నూతన భవనం నిర్మించారు. ఉయ్యూరు డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వాస్పత్రి నూతన భవనం 50 పడకలతో రూ.3.40 కోట్లతో నిర్మించారు. ఆయా ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. సాధారణ వ్యాధులు, చిన్న పిల్లలు, గైనిక్, మత్తు నిపుణులు, దంత తదితర విభాగాలకు చెందిన వైద్యసేవలు ప్రజలకు అందుతున్నాయి. ఇవి కాకుండా రూ.1.03 కోట్ల అంచనాతో ఉయ్యూరులో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తయ్యింది. కాటూరు గ్రామంలో రూ.1.60 కోట్లతో పీహెచ్‌సీ నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయి.

రూ.92 లక్షలతో నాడు–నేడు పనులు

రూ.92 లక్షలతో అంచనాతో నాడు - నేడు పనులు నిర్వహించారు. పెనమలూరు, ఉప్పలూరు, చిన ఓగిరాల, కాటూరు పీహెచ్‌సీల్లో నాడు–నేడు పథకం కింద ఆస్పత్రుల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన జరిగింది. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా కోలవెన్ను గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్ రూ.8.80 లక్షలతో అభివృద్ధి చేశారు. దాతల భాగస్వామ్యంతో రూ.5.80 లక్షలతో ప్రహరీ, ఇతరత్రా వసతుల కల్పన సమర్థంగా జరిగింది. అంతేకాకుండా పోరంకి గ్రామంలో పీహెచ్‌సీ నిర్మాణానికి రూ.2.40 కోట్లు నిధులు కేటాయించారు. భవన నిర్మాణానికి స్థలం గుర్తించారు. అయితే నిర్మాణపరమైన అవరోధాల కారణంగా పనులు ముందుకు సాగలేదు. ఈ ప్రాంతంలో పీహెచ్‌సీ అందుబాటులోకి వస్తే ప్రజారోగ్యానికి చింత ఉండదు.

ఆస్పత్రుల అభివృద్ధి అంశాలు	
అందుబాటులో ఉన్న సిబ్బంది	: 273 మంది
ప్రతి నెలా వైద్య సేవలు పొందుతున్న వారు	: 32100
కంకిపాడు సీహెచ్‌సీ	: రూ.4.60 కోట్లు
ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రి	: రూ.3.40 కోట్లు
ఉయ్యూరు అర్బన్ హెల్త్‌సెంటర్	: రూ.1.03 కోట్లు
కాటూరు పీహెచ్‌సీ భవనం	: రూ.1.60 కోట్లు
నాడు–నేడుతో ఆస్పత్రుల అభివృద్ధి వ్యయం	: రూ.92 లక్షలు

టీడీపీ హయాంలో నిర్లక్ష్యం

గత టీడీపీ ప్రభుత్వం వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఆస్పత్రులకు కనీస మౌలిక వసతులు కల్పించటంలో వైఫల్యం చెందింది. మందులు లేక, సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడ్డ పరిస్థితి. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డా, అత్యవసర వైద్య సేవలకు ఆస్పత్రికి వెళ్లినా అందని దుస్థితి. విజయవాడలోని పెద్దాస్పత్రికి పంపించేవారు. అనేక వ్యయప్రయాలస కోర్చి వైద్యం చేయించుకునేవారు. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది. నూతన ఆస్పత్రి భవనాలు, అధునాతన వసతులు, మెరుగైన వైద్య పరీక్షలు, వైద్య సేవలు, సమృద్ధిగా మందుల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఓపీతో పాటు ఆస్పత్రిలో ఉంచి వైద్యం అందించేందుకు పడకలు కూడా సిద్ధంగా ఉంచారు. అత్యవసర సేవలకు ప్రాథమిక వైద్యం పూర్తి స్థాయిలో అందిస్తున్నారు. మైనర్ సర్జరీలు పూర్తి చేసి మెరుగైన వైద్యానికి విజయవాడ పంపుతున్నారు. వైద్య రంగంలో వచ్చిన గణనీయ అభివృద్ధిని చూసి ప్రజానీకం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

వైద్యం సంతృప్తికరంగా ఉంది..



గతంలో ఇలాంటి వైద్యం అందలేదు. మందులు పూర్తిగా ఉండేవి కాదు. ఇప్పుడు మాత్రం సిబ్బంది ఏ వేళ అయినా అందుబాటులో ఉంటున్నారు. సరైన వైద్యం చేయటంతో పాటుగా అన్ని మందులూ ఇక్కడే ఇస్తున్నారు. విజయవాడ పెద్దాస్పత్రికి పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఆరోగ్యం కుదుట పడుతుంది. వైద్య రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత సంతృప్తికరంగా ఉంది.

– కె.పరమేశ్వరరావు, కంకిపాడు

ప్రజారోగ్యానికి ఎంతో ప్రాధాన్యం..



ఒకప్పుడు ఇరుకు గదుల్లో కంకిపాడు ఆస్పత్రి ఉండేది. పీహెచ్‌సీ కాస్తా సీహెచ్‌సీ అయినా అదే పరిస్థితి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఆస్పత్రి భవనానికి నిధులు కేటాయించారు. అన్ని వసతులతో ఆస్పత్రి భవనం కట్టారు. అన్ని రకాల వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది.

– టి.వెంకటేశ్వరరావు, కంకిపాడు

అందుబాటులో అన్ని వైద్య సేవలు..



కంకిపాడు సీహెచ్‌సీలో సిబ్బంది కొరత లేదు. అన్ని విభాగాల నిపుణులు అందుబాటులో ఉన్నారు. మేజర్ సర్జరీలు పైల్స్, హెర్నియా, 24 గంటల కడుపు నొప్పికి ఇక్కడే వైద్యం అందిస్తున్నాం. ప్రభుత్వం వైద్యసేవలపై దృష్టి పెట్టింది. లక్ష్యాలకు అనుగుణంగా సిబ్బంది బాధ్యతతో పని చేస్తున్నాం. రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ ఎం.సంజయ్, సూపరింటెండెంట్, కంకిపాడు సీహెచ్‌సీ

క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పెనమలూరు: గోసాల వైకుంఠపురంలో నూతనంగా నిర్మించిన శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయాన్ని నిర్మించిన ఆలయ కమిటీ సభ్యులను మంత్రి అభినందించారు. గ్రామ సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, డైరెక్టర్ పోలవరపు రవి, నేతలు రాచూరి చిరంజీవి, ఆసిఫ్, విజయ పలువురు పాల్గొన్నారు.

అవినీతి, అరాచకాలకు కేరాఫ్ పార్థసారథి

ఉయ్యూరు: అవినీతి, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అని మాజీ జెడ్పీటీసీ యలమంచిలి పూర్ణిమ అన్నారు. స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. పెనమలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పార్థసారథి బాగోతం అందరికీ తెలిసిందేనన్నారు. వైఎస్సార్ సీపీలో ఏం అన్యాయం జరిగిందని టీడీపీ కండువా కప్పుకున్నాడో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఆయన, ఆయన వర్గీయులు అరాచకాలు, అక్రమాలకు పాల్పడి దోచుకున్నారని, ప్రజల అభిమాన నేత జగనన్ననే విమర్శిస్తారా? అని మండిపడ్డారు. ఎవరు అరాచక పాలన సాగించారో ప్రజలను అడిగితే చెబుతారన్నారు. తన ఇంటిపైకి వచ్చి దౌర్జన్యం చేసి బెదిరించింది అరాచకం కాదా? అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీని, ముఖ్యమంత్రి జగన్‌ను విమర్శించే అర్హత పార్థసారథికి లేదన్నారు. మహిళలు అంటే గౌరవం లేని వ్యక్తులు కూడా టీడీపీలో చేరి వ్యాఖ్యలు చేయటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్థసారథి ఓటమి ఖాయమని స్పష్టం చేశారు.

సెమీ కండక్టర్ రంగానికి ప్రాధాన్యం



సుంకర వెంకట్

పెనమలూరు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొవటానికి సెమీ కండక్టర్ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని బెంగుళూరుకు చెందిన చిప్ ఎడ్జ్ టెక్నాలజీ సీఈఓ సుంకర వెంకట్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సోమవారం చిప్ డిజైన్ సవాళ్లు, సెమీ కండక్టర్ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. వెంకట్ మాట్లాడుతూ.. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నందున విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సదస్సులో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాత ప్రదర్శనలు

గన్నవరంరూరల్: ప్రజల భాగస్వామ్యంతో ఎయిడ్స్ నివారణ సాధ్యమని కళాజాతా కళాకారులు ప్రదర్శన ద్వారా వివరించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని గొల్లనపల్లి గ్రామంలో పలు సెంటర్లలో కళాజాతా నిర్వహించారు. ఎం.శేఖర్ బాబు, వై.వీరయ్య, వై.రవితేజ, ఎం.చిరంజీవి. ఎం.ప్రసాద్, ఎం.కుమార్, బృందంగా వీధి నాటికను ప్రదర్శించారు. ప్రభుత్వం ఎయిడ్స్ నివారణకు చర్యలు తీసుకోవటంతో పాటు ఐసీటీసీ సెంటర్ల ద్వారా రక్త పరీక్షలు నిర్వహిస్తూ, ఏఆర్‌టీ మందులు అందజేస్తోందన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్న పత్రాలు

పెనమలూరు: ఇంటర్మీడియెట్ ప్రశ్న పత్రాలు సోమవారం పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. ఇంటర్ పరీక్షలు వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభమై, 16వ తేదీ వరకు జరగనున్నాయి. మండల పరిధిలో 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు సంబంధించి ప్రశ్న పత్రాలు పోలీస్‌స్టేషన్‌కు రాగా వాటిని భద్రపరిచారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించటానికి చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు.

వీరవల్లి రైల్వే గేటు వద్ద ఆర్‌ఓబీ నిర్మించాలని వినతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లి రైల్వే గేటు వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ రైల్వే అధికారులకు ఏపీ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు వినతి పత్రాన్ని అందజేశారు. కోడూరుపాడులో రైల్వే అండర్ పాస్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన దక్షిణ మధ్య రైల్వే ఏలూరు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ పి.సంతోష్ కుమార్‌ను కలిసి ఈ మేరకు సోమవారం విజ్ఞప్తి చేశారు. వీరవల్లి ఎల్‌సీ నెం.331 రైల్వే గేటు స్థానంలో ఆర్‌వోబీకి వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. వేలేరులో ఎల్‌సీ నెం.334 వద్ద కూడా ఎస్సీ కాలనీవాసులకు వీలుగా రైల్వే అండర్ పాస్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

మానవతా ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డులోని అప్పనవీడు జెడ్పీ హైస్కూల్‌లో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై పోటీల్లో జరిగాయి. ఎస్.లిఖిత(వీరవల్లి జెడ్పీహెచ్‌ఎస్), సీహెచ్ సునీత(వేలేరు జెడ్పీ హెచ్‌ఎస్), లోక పవన్(జ్యోతి హైస్కూల్) వరుసగా తొలి మూడు స్థానాలను సొంతం చేసుకున్నారు. విజేతలను అభినందించారు. మానవతా రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శి కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, జిల్లా కోశాధికారి వడ్డీ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం కొయ్యూరు శివారులోని పామాయిల్ తోటల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న జూద శిబిరంపై హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ – 2 పి.అర్జమ్మ నేతృత్వంలో పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. ముందస్తు సమాచారంతో పక్కా ప్రణాళికతో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు జూదరులు, తొమ్మిది బైక్‌లు, రెండు కోడి పుంజులతో పాటు రూ.1,250 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిశ్చితార్థం చేసుకోని మోసగించిన వారిపై కేసు

పెనమలూరు: వివాహ నిశ్చితార్థం చేసుకోని మోసగించిన వ్యక్తులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. యనమలకుదురు డొంక రోడ్డులో ఓ గృహ ప్రవేశానికి సులేమాన్ కుటుంబ సభ్యులు వచ్చారు. వారు ఆ ఇంటి యజమాని కుమార్తెను చూసి తమ కుమారుడు అమీర్‌ఆలీకి ఇచ్చి వివాహం చేయాలని కోరారు. దీంతో యువతి కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా నిశ్చితార్థం చేశారు. వివాహం చేసేందుకు కొంత గడువు కావాలని యువతి కుటుంబ సభ్యులు కోరారు. దీంతో నిశ్చితార్థం రద్దు చేసుకుంటామని సులేమాన్, అమీర్‌ఆలీ, మరి కొందరు గొడవకు దిగి బెదిరించారు. దీంతో బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

కంకిపాడు: ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని వణుకూరు ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కె.నాగలక్ష్మి అన్నారు. కంకిపాడు పట్టణంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ఆర్‌బీఐ వారి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని ఆర్థిక అక్షరాస్యతా ర్యాలీ సోమవారం నిర్వహించారు. స్థానికంగా ఉన్న ఎస్ఎస్ మహిత డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో నాగలక్ష్మి మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. బ్యాంకుల్లో ఖాతాలను తెరిచి పొదుపు అలవాటు చేసుకోవాలన్నారు. ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. మండల కోఆర్డినేటర్ కైలే సునీల్, హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కౌన్సిలర్ హేమారావు, కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.శాస్త్రి, సచివాలయ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు. ఆర్థిక అక్షరాశ్యతపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు.

తేలప్రోలు కొత్తూరు రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం



ఆర్‌యూబీని ప్రారంభిస్తున్న ఏడీఎంఎం దేవేంద్రస్వామి, ప్రజా ప్రతినిధులు

ఉంగుటూరు: విజయవాడ – విశాఖపట్నం సెక్షన్‌లో తేలప్రోలు శివారు కొత్తూరులో లెవల్ క్రాసింగ్ నంబరు 328 స్థానంలో రైల్వే అండర్ బ్రిడ్జి(అండర్ పాస్)ను స్థానిక ప్రజా ప్రతినిధులు, రైల్వే అధికారులు సోమవారం ప్రారంభించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా రూ.41 వేల కోట్లతో 544 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధికి, 1,500 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ క్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, తేలప్రోలు సర్పంచ్ లాం దిబోర, ఎంపీటీసీ తియ్యగూర వాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రైల్వే గేటు లేకుండా అండర్ పాస్ ద్వారా మార్గాన్ని సుగమం చేయడం వలన ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే బెజవాడ డివిజన్ ఏడీఎంఎం పి.దేవేంద్రస్వామి, రైల్వే స్సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసులపై యార్లగడ్డ దురుసు ప్రవర్తన



పోలీసులపైకి దూసుకువెళ్తున్న వెంకట్రావు

పి.నైనవరం(విజయవాడరూరల్): విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు దురుసుగా ప్రవర్తించిన సంఘటన విజయవాడ రూరల్ మండలం పి. నైనవరం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. బాబు ష్యూరిటీ– భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం యార్లగడ్డ వెంకట్రావు తన అనుచర గణంతో కలిసి పి.నైనవరంలో పర్యటించారు. ఈ ర్యాలీలో కొంత మంది యువకులు మద్యం మైకంలో సైలెన్సర్లు తొలగించిన ద్విచక్ర వాహనాలను భారీ శబ్దాలతో వేగంగా నడుపుతూ బీభత్సం సృష్టించారు. రోడ్లపై హడావుడి చేస్తున్న యువకులను పోలీసులు కంట్రోల్ చేసేందుకు ప్రయత్నించారు. అయితే యువకులకు నచ్చచెప్పాల్సిన టీడీపీ నాయకులు పోలీసులపై గొడవకు దిగారు. ఇది గమనించిన యార్లగడ్డ ఆవేశంగా పోలీసులపైకి దూసుకువెళ్లారు. మీరు పోలీసులా, వైఎస్సార్ సీపీ కార్యకర్తలా అంటూ యార్లగడ్డ దురుసుగా మాట్లాడుతూ పార్టీ శ్రేణులను రెచ్చకొట్టే ప్రయత్నం చేశారు. యార్లగడ్డ సూచన మేరకు టీడీపీ నేతలు, కార్యకర్తలు పోలీసులపై తిరగబడే ప్రయత్నం చేశారు. ఒక దశలో పోలీసులను నెట్టివేయడం, భౌతిక దాడి చేసేందుకు కూడా ఆ పార్టీ శ్రేణులు సిద్ధమయ్యారు. అయితే పోలీసులు మాత్రం సంయమనం పాటించడంతో కొద్ది సేపటికి గొడవ సర్దుమణిగింది. అయితే యార్లగడ్డ వ్యవహార శైలి చూసిన గ్రామస్తులు ముక్కున వేలేసుకున్నారు. హద్దు దాటిన యువకులను మందలించాల్సింది పోయి పోలీసులపై చిందులు వేయడాన్ని తప్పు పడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ర్యాలీ

గన్నవరం: దేశంలో రైతులు, కార్మికుల జీవితాలతో ఆటలాడుతున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ఉద్యమించాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు పిలుపునిచ్చారు. ఢిల్లీలో పోరాడుతున్న రైతులపై మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై, క్విట్ ప్రపంచ వాణిజ్య ఒప్పందానికి నిరసనగా సోమవారం రైతు, కార్మిక సంఘాలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం కారణంగానే అన్నదాతలు రెండో దఫా పోరాటాన్ని చేపట్టారన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై పోలీసులు కాల్పులకు పాల్పడడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, ప్రపంచ వాణిజ్య ఒప్పందాన్ని బహిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమందరావు డిమాండ్ చేశారు. రైతు సంఘాల నేతలు వై.నరసింహారావు, టీవీ లక్ష్మణస్వామి, ఎం. ఉమామహేశ్వరరావు, ఆంజనేయులు, మరియదాసు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి జగనన్న ప్రభుత్వం తోడ్పాటు



గన్నవరంలో ఆసరా సంబరాలకు హాజరైన మహిళలు



వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎంపీపీ రవి, ప్రజాప్రతినిధులు

గన్నవరం: మహిళల అభ్యున్నతికి జగనన్న ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక శ్రీఆంజనేయ స్వామి ఆలయం సమీపంలోని సపోటా తోటలో సోమవారం మండల స్థాయిలో వైఎస్సార్ ఆసరా ఉత్సవాలను నిర్వహించారు. మండలంలోని 1,604 డ్వాక్రా గ్రూపులకు వైస్సార్ ఆసరా నాల్గోవ విడత కింద మంజూరైన రూ.14.99 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవి మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా రుణామాఫీ పేరుతో మహిళలను దారుణంగా మోసగించిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం 2019 ఎన్నికల ముందు వరకు ఉన్న డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా నగదు చెల్లించి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని చెప్పారు. ఈ పథకం ద్వారా మండలంలోని 15,974 మంది మహిళలకు రూ.60.01 కోట్ల లబ్ధి చేకూర్చిందన్నారు. మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం వైఎస్. జగన్‌ను, ఎమ్మెల్యే వల్లభనేని వంశీని నిండు మనసుతో ఆశీర్వాదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య మాట్లాడుతూ.. చంద్రబాబు వంటి దగా కోరును నమ్మి మహిళలు మరోసారి మోసపోవద్దని సూచించారు. ఎన్నికల ముందు నియోజకవర్గానికి వచ్చి, ఎన్నికల తర్వాత ఎగిరిపోయే వలస పక్షులను కూడా నమ్మవద్దన్నారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌసాని, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, మాజీ వైస్ ఎంపీపీ పరంధామయ్య, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఓ మాధవీ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

పెనమలూరు: కోతముక్క ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఐ వి.శేషుకుమార్ సిబ్బందితో చోడవరం కరకట్ట ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా ఆరుగురు వ్యక్తుల కోత ముక్క ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద రూ.2,500 నగదు, నాలుగు బైక్‌లు సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

ఉయ్యూరు: డయల్ యువర్ డీఎం కార్యక్రమం మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతుందని డిపో మేనేజర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు 99592 24796 నంబరుకు ఫోన్ చేసి సూచనలు, సమస్యలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ఉయ్యూరు: అగ్ని ప్రమాద బాధిత రైతు కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం అందించింది. పట్టణానికి చెందిన నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు పశువుల పాక ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై రెండు పాడి పశువులు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటేశ్వరరావుకు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కౌన్సిలర్లు గోన మదన్, గుంజా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అందజేత

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు రామాలయం రోడ్డులో నివాసం ఉంటున్న పెట్ల నాగేశ్వరరావు, రేవతి దంపతులకు జీవనోపాధి నిమిత్తం సోమవారం వైఎస్ఆర్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ కుట్టుమిషన్‌ను అందజేశారు. జయప్రకాష్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు జీవనోపాధి కల్పించేందుకు తమ చారిటీస్ ఇస్త్రీ, కూరగాయల బండ్లు,, బడ్డీకొట్లు, కుట్టుమిషన్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో త్రిపురనేని పార్థసారథి, త్రిపురనేని నాగ శ్రీనివాస్‌రావు, త్రిపురనేని గాయత్రి, వార్డు సభ్యులు యలమంచిలి శివ, వెల్లంకిరాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు సోమవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని సిండికేట్ బ్యాంక్ కాలనీ, కొట్టివారి వీధి, చిన్మయి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.